# ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తాం


పాఠశాల తరగతి గదులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

- ఉపాధ్యాయులను నియమించేందుకు చర్యలు
- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్, జనవరి 5: రాష్ట్ర విద్యాభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. శుక్రవారం కేశంపేట మండల కేంద్రంలో ప్రభుత్వ పాఠశాలలోని నూతన తరగతి గదులను ప్రారంభించి మాట్లాడారు. రానున్న రోజుల్లో ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేస్తామని, విద్యార్థులకు సరిపడా ఉపాధ్యాయులను నియమించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. అన్ని వర్గాల ప్రజలు ప్రభుత్వ పాఠశాలలను ఆదరించాలని కోరారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు పని చేస్తాయన్నారు. మన ఊరు–మన బడి కార్యక్రమంలో భాగంగా రూ. 52.82 లక్షలు, ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో కలిపి మొత్తం రూ. 77 లక్షల వ్యంతో పాఠశాల నిర్మాణం జరిగిందన్నారు. అదే విధంగా వేములనర్వ గ్రామంలో తుక్కుగూడ నారాయణరెడ్డి జ్ఞాపకార్థం నిర్మించిన దేవాలయ ముఖ ద్వారాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి, జడ్పీటీసీ విశాల, సర్పంచ్ వెంకట్‌రెడ్డి, నాయకులు వీరేశం, శ్రీధర్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## క్రీడా స్ఫూర్తితో పోటీపడాలి

- మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్


క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న అంజయ్యయాదవ్

షాద్‌నగర్, జనవరి 5: ఆటల్లో గెలుపోటములు సహజమని, క్రీడా స్ఫూర్తితో పోటీ పడాలని మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అన్నారు. చౌదరిగూడ మండలం పెద్దఎల్కిచర్ల గ్రామంలో సర్పంచ్ భూపాలచారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌ను శుక్రవారం ప్రారంభించి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులను ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉందన్నారు. టోర్నమెంట్ నిర్వహించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పీ వైస్ చైర్మన్ నవీన్‌కుమార్‌రెడ్డి, చౌదరిగూడ సర్పంచ్ బాబురావు, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ఆఫీజ్, కొందుర్గు మండలాధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, నాయకులు శివ, రాజు, చెన్నయ్య, శ్రీకాంత్, శ్రీనివాస్, రాంచంద్రయ్య పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి

షాబాద్, జనవరి 5: రోడ్డు ప్రమాదంలో ఓ విద్యార్థి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని సంకెపల్లిగూడ గ్రామంలో జరిగింది. ఎస్ఐ మహేశ్వర్‌రెడ్డి వివరాల ప్రకారం...మండలంలోని సంకెపల్లిగూడ గ్రామానికి చెందిన రాఘవేందర్‌గౌడ్(21) గురువారం రాత్రి 11గంటల సమయంలో నాగరగూడ నుండి సంకెపల్లిగూడ గ్రామానికి బైకుపై వస్తున్నాడు. మార్గమధ్యలో భారత్‌గ్యాస్ గోదాం వద్ద బైకు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో అతడి ఛాతీ భాగంలో బలమైన గాయాలయ్యాయి. చికిత్స నిమ్మిత్తం షాద్‌నగర్ ప్రభుత్వ దవాఖానకు తీసుకువెళ్లగా.. అప్పటికే రాఘవేందర్ మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి తండ్రి శ్రీశైలంగౌడ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## బస్సు-స్కూటీ ఢీకొన్న ఘటనలో ఒకరు..

యాచారం : ఆర్టీసీ బస్సు స్కూటీని ఢీకొన్న ఘటనలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని మాల్ మైసమ్మ ఆలయ సమీపంలో నాగార్జునసాగర్–హైదరాబాద్ ప్రధాన రహదారిపై జరిగింది. సీఐ సైదయ్య వివరాల ప్రకారం.. మండలంలోని నందివనపర్తి గ్రామానికి చెందిన నాగలపల్లి రాంరెడ్డి (65) తన స్కూటీపై మాల్ వెళ్తున్నాడు. అదే సమయంలో ఎదురుగా వస్తున్న దేవరకొండ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు బలంగా ఢీకొట్టింది. అనంతరం అతని తలపై నుంచి బస్సు వెళ్లడంతో తల నుజ్జునుజ్జు అయ్యింది. దీంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## పాఠశాలలను అభివృద్ధి చేయడం అభినందనీయం


విద్యార్థులతో ఇక్ఫాయ్ ఫౌండేషన్ సభ్యులు

శంకర్‌పల్లి, జనవరి 5 : ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయడం అభినందనీయమని దొంతాన్‌పల్లి సర్పంచ్ అశ్విని సుధాకర్ అన్నారు. శుక్రవారం మండలంలోని దొంతాన్‌పల్లి గ్రామ శివారులో గల ఐబీఎస్ కళాశాల విద్యార్థులు గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలకు రంగులు వేసి గోడలపై సుందరమైన బొమ్మలను గీసి ప్రభుత్వ పాఠశాల రూపు రేఖలు మార్చారు. ఇక్ఫాయ్ ఫౌండేషన్ నిధులను సమకూర్చింది. ప్రతి శుక్రవారం కళాశాల విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలకు వెళ్లి మోటివేషన్ క్లాసులు తీసుకుని శుభ్రతపై అవగాహన కల్పించారు. సర్పంచ్ అశ్విని మాట్లాడుతూ ఇక్ఫాయ్ ఫౌండేషన్ పాఠశాల అభివృద్ధికి మరింత సహకారం అందించాలన్నారు. కార్యక్రమంలో ఇక్ఫాయ్ ఫౌండేషన్ సభ్యులు, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## నందిగామ సీఐగా పి.ప్రసాద్


సీఐ పి.ప్రసాద్

నందిగామ, జనవరి 5 : నందిగామ సీఐగా విధులు నిర్వహిస్తున్న ఎన్.సురేశ్ బదిలీపై హైదరాబాద్‌లోని బాలానగర్ పీఎస్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో మేడ్చల్ డీఐ సీఐగా విధులు నిర్వహిస్తున్న పి.ప్రసాద్‌ను నందిగామకు బదిలీ చేశారు. శుక్రవారం నందిగామ సీఐగా బాధ్యతలను స్వీకరించారు.

# అయోధ్య రాముడి అక్షింతల పంపిణీ


పెద్దఅంబర్‌పేటలో అక్షింతలు ఇంటింటికీ పంపిణీ చేస్తున్న గ్రామ పెద్దలు


షాబాద్ : చిన్నసోలిపేట్‌లో అక్షింతలు పంపిణీ చేస్తున్న గ్రామస్తులు

చేవెళ్ల రూరల్, జనవరి 5 : ప్రతి ఇంటికి అయోధ్య రాముడి అక్షింతలు పంపిణీ చేయనున్నట్లు వైస్ ఎంపీపీ శివ ప్రసాద్ అన్నారు. చేవెళ్ల మండల పరిధిలోని ఊరెళ్ల, మడికట్టు గ్రామాల్లో రాముడి అక్షింతలకు శుక్రవారం ఆలయాల్లో పూజలు నిర్వహించి ఇంటింటికీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

**షాద్‌నగర్‌టౌన్ :** మున్సిపాలిటీలోని ప్రతి వార్డులో శ్రీరామ భక్తులు భక్తిశ్రద్ధలతో భజన చేస్తూ ప్రతి ఇంటికి అక్షింతలను అందజేస్తున్నారు. శుక్రవారం పట్టణంలోని శ్రీనివాసకాలనీలో అక్షింతలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ఈ నెల 22 అయోధ్యలో జరుగనున్న రాముల వారి విగ్రహ ప్రాణప్రతిష్ఠ సందర్భంగా ప్రతి ఒక్కరూ దేవాలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. సాయంత్రం సమయాల్లో తమ ఇంటి ముందు 5 దీపాలను వెలిగించాలన్నారు. కార్యక్రమంలో నారాయణమూర్తి, సాయినాథ్, నరేశ్, లావణ్య, భరత్, శిరీష, పుష్పమ్మ పాల్గొన్నారు.

**షాబాద్ :** చిన్నసోలిపేట్ గ్రామంలో అయోధ్య రాముడి అక్షింతలకు పూజలు నిర్వహించి ఇంటింటికీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రాంచంద్రారెడ్డి, శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.


షాద్‌నగర్‌టౌన్: అయోధ్య రాముడి అక్షింతలను అందజేస్తున్న శ్రీరామ భక్తులు


చేవెళ్లరూరల్: ఊరెళ్ల గ్రామంలో అక్షింతలు పంపిణీ చేస్తున్న వైస్ ఎంపీపీ శివ ప్రసాద్ తదితరులు

**చేవెళ్లటౌన్ :** అయోధ్యలోని రామ మందిర అక్షింతలు గ్రామానికి రావడం అదృష్టమని చేవెళ్ల గ్రామ సర్పంచ్ బండారు శైలజ అన్నారు. మండల కేంద్రంలోని వేంకటేశ్వర స్వామి దేవాలయం నుంచి ఊరేగింపుగా గ్రామంలోని హనుమాన్ దేవాలయంలోకి తీసుకెళ్లి పూజలు నిర్వహించారు. అనంతరం ఇంటింటికీ పంపిణీ చేశారు చేశారు.

**ఇబ్రహీంపట్నంరూరల్ :** రాయపోల్ గ్రామంలో అయోధ్య రామమందిరం అక్షింతలను ఇంటింటికీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బల్వంత్‌రెడ్డి, గ్రామస్తులు రమణారెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

**పెద్దఅంబర్‌పేట :** పెద్దఅంబర్‌పేటలో చెరుకూరి జగన్ ఆధ్వర్యంలో గ్రామ పెద్దలు, మహిళలు పెద్ద ఎత్తున ఊరేగింపు నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి అక్షింతలు పంపిణీ చేశారు. వారికి ఆయా ఇండ్ల వద్ద మంగళహారతులతో స్వాగతం పలికారు.


చేవెళ్ల టౌన్ : అక్షింతలను ఊరేగింపుగా తీసుకెళ్తున్న భక్తులు

## మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం


మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న సత్యం

ఆమనగల్లు, జనవరి 5 : మండల పరిధిలోని శెట్టిపల్లి గ్రామానికి చెందిన ముత్తోజు నర్సమ్మ అనారోగ్యంతో మృతి చెందింది . విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు ఎగిరిశెట్టి సత్యం మృతురాలి కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం కుటుంబ సభ్యులకు రూ. 10 వేల తక్షణ ఆర్థిక సాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో చంద్రమౌళి, నర్సింహ్మా, పెద్దయ్యచారి, కృష్ణ చారి, వెంకటేశ్ పాల్గొన్నారు.

## పేద విద్యార్థులకు దాతల సహకారం అవసరం

షాబాద్, జనవరి 5: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే పేద విద్యార్థులకు దాతల సహకారం ఎంతో అవసరమని కుర్వగూడ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం ధనలక్ష్మి అన్నారు. శుక్రవారం షాబాద్ మండల పరిధిలోని కుర్వగూడ ప్రాథమిక పాఠశాలలో విద్యాకమిటీ సమావేశం నిర్వహించారు. అనంతరం పాఠశాలలో చదువుకున్న 2004–2005 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ప్లాన్లు అందజేశారు. కార్యక్రమంలో పూర్వపు విద్యార్థులు దాదే మహేశ్, రామకృష్ణ, ఆనంద్, ప్రవీణ్, నవీత తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
WANTED
★ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం, జీతం: 18K. Ph: 9640400073/9160900024.
NT-319407-All
గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
Telangana Today
FOR LOCAL TO GLOBAL NEWS
పుట్టినరోజు, పదవీ విరమణ, వార్షికోత్సవ శుభాకాంక్షలు, వర్ధంతి, జయంతి, లీగల్ నోటీసులు మరియు ఇతర ప్రకటనల కొరకు
ఈ దిగువ తెలిపిన నెంబర్లపై సంప్రదించగలరు.
ప్రకటనల విభాగం సెల్: 80966 77655
వికారాబాద్/పరిగి/శంకర్‌పల్లి : 91827 77665
తాండూర్/కొడంగల్ : 80966 77668
ఇబ్రహీంపట్నం/మహేశ్వరం : 80966 77962